సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి



అన్నింటా ఆమె..



మహిళలు ప్రగతికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. సేవల్లో ముందుంటున్నారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. కుటుంబాన్ని ఆదర్శంగా నడిపి మహారాణులుగా పేరొందుతున్నారు. హక్కుల కోసం.. పీడిత ప్రజల గొంతై నినదిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలు **సమాజం కోసం ఏవిధంగా పని చేస్తున్నారో పరికిద్దాం...**

- గోపాలపట్నం

- సమాజ హితం కోసం తమదైన పాత్ర
- మహిళల హక్కుల కోసం పోరుబాట
- విభిన్న బాధ్యతలు మోస్తున్న స్త్రీ మూర్తి
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తండ్రి అకాల మరణంతో...



కోవిడ్ సమయంలో తండ్రి మృతి ఆ కుటుంబాన్ని కలవరపరిచింది. అంతే చిన్న వయసులో పీస్ ఏంజెల్ బ్లెస్సీ భుజాలపై మోయలేని భారం పడింది. ఆమె గుండె ధైర్యాన్ని చూసిన వారంతా దేవుని సేవకై దేవుని బిడ్డగా పుట్టిందని కొనియాడుతున్నారు. జీవీఎంసీ 92వ వార్డు బుచ్చిరాజుపాలెం ఎరుసలేమ్ చర్చి పాస్టర్ జాన్ ప్రకాష్ కోవిడ్ రెండో వేవ్‌లో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో తండ్రి బాధ్యతను కుమార్తె పీస్ ఏంజెల్ బ్లెస్సీ 18 ఏళ్లకే తీసుకుంది. అక్కడి సంఘ సభ్యుల మన్ననలు పొందుతూ సంఘ కాపరిగా కొనసాగుతోంది. పేదలకు తమ వంతు సాయం అందిస్తూ దేవుని సేవలో తరిస్తోంది. తండ్రి బాధ్యతను నెరవేర్చడమే కర్తవ్యమంటోంది. బ్యాచిలర్ ఆఫ్ థియాలజీ (డిగ్రీ) చదువుతోంది.

గ్రామాభివృద్ధిలో నారీమణులు

మహిళా సంఘం ద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు జనతాకాలనీకి చెందిన ఎం.విమల. శ్రమదానం ద్వారా మొక్కలు నాటుతున్నారు. సామాజిక అంశాలతో పాటు మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. స్థానికంగా ఏదైనా సమస్య ఉంటే వెంటనే స్పందించి నాయకులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తున్నారు. అలా జనతా కాలనీ మహిళా సేవా సంఘం సభ్యురాలు విమలకు గ్రామంతో విడదీయరాని బంధం ఏర్పడింది. జనతా కాలనీ, పద్మనాభనగర్ ప్రాంతాలను చూస్తే స్థానికులకు ఈ మహిళా సంఘమే గుర్తుకు వస్తుంది. విద్యార్థులకు పుస్తకాలు, పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ చేసి సేవా కార్యక్రమాల్లో తరిస్తూ ఇక్కడి ప్రగతికి మహిళా సంఘ ప్రతినిధులే పాత్రధారులుగా నిలుస్తున్నారు.



పద్మనాభనగర్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న విమల(ఫైల్)

మహిళల గొంతుకై...

మహిళలు సొంతంగా ఆర్థిక, సామాజిక ప్రగతి సాధించిన నాడే మహిళాభివృద్ధిగా భావిస్తామంటూ వారి గొంతుక అవుతున్నారు ఐద్వా నాయకురాలు ప్రభావతి. పురుషాధిక్య సమాజంలో స్త్రీలకు సమాజంలో సరైన స్థానం లేదనే నిగూఢ వాస్తవం.. అందుకే ఆమె మహిళాభ్యుదయ వాదిగా పోరాటాలు చేస్తోంది. తన ప్రభను నలు దిశలా ప్రసరింపజేస్తోంది. ఐద్వా నాయకురాలిగా మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై పోరాటాలు చేస్తోంది. అలాగే మహిళల్లో స్వావలంబన కోసం పలు రకాల శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. పేదలకు అండగా నిలుస్తోంది. ఎవరికి అన్యాయం జరిగినా నేనున్నానంటూ భరోసాగా ఇస్తోంది.

డాక్టర్ కావాలనుకున్నా.. పాస్టర్ అయ్యా



డాక్టర్ కావాలనుకున్నాను.. కాని విధి నన్ను పాస్టర్ చేసింది. నాన్న ఆశయాలు, ఆదర్శాలు నన్ను పాస్టర్‌గా మార్చాయి. దేవుని సేవ చేస్తూ పేదలకు నా వంతు సాయం అందిస్తున్నాను. మా సేవలు ఇతర ప్రాంతాల్లో కూడా ఏటా అందిస్తున్నాం. వాటిని మరింత విస్తృత పరుస్తాం. మహిళలు బాగుంటే ఆ కుటుంబం బాగుంటుందని మా నమ్మకం. వారిని జాగృతం చేస్తున్నాం.

- సిస్టర్ పీస్ ఏంజెల్ బ్లెస్సీ, జయప్రకాష్‌నగర్ ఎరుసెలం చర్చి పాస్టర్

కాలనీ అభివృద్ధే లక్ష్యం



జనతా కాలనీ మహిళ సేవా సంఘం కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉంది. మా కాలనీ అభివృద్ధికి, మహిళా వికాసానికి ఎంతో కృషి చేసిన సంఘంగా గుర్తింపు లభించింది. మా కాలనీ వాసుల సౌకర్యాల కోసం శ్రమదానం చేశాం. పోరాటాలు చేసి అభివృద్ధి పనులు సాధించాం. కాలనీ వాసుల మన్ననలు పొందాం. 20 ఏళ్లుగా నిర్విరామంగా మా సంఘం కొనసాగుతోంది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం.

- ఎం విమల, జనతా కాలనీ మహిళా సంఘం సభ్యురాలు, ఆర్ఆర్ వెంకటాపురం,

చిత్తశుద్ధి అవసరం



మహిళల అభివృద్ధికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి. వారి స్వావలంబనకు ఉపయోగపడే విధంగా పథకాలు అమలు చేయాలి. ఇంట్లో మహిళ గృహిణిగా కాకుండా గృహోపకరణాలు చేసే విధంగా తయారు కావాలి. ఆ విధంగా పాలకులు తగిన ప్రోత్సాహం ఇవ్వాలి. పని ప్రదేశాలు.. ఇతర ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి. మహిళల హక్కుల కోసం నిరంతరం ఉద్యమిస్తాను.

వి. ప్రభావతి, ఐద్వా నాయకురాలు, విమాన్‌నగర్

క్లుప్తంగా

అన్ని రంగాల్లో మహిళల హవా



రోహిణి అపరంజిని సత్కరిస్తున్న అధ్యాపకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని విశాఖ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోహిణి అపరంజి కొరటి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు. కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు పోటీ పడుతున్నారని, నింగికి ఎగురుతున్నారన్నారు. సమాజంలో ఇంకా మార్పు అవసరమని చెప్పారు. రోహిణి అపరంజిని చైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జి.వి.ప్రదీప్ వర్మ, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

గోపాలపట్నం: మద్యానికి బానిసైన పసుపురెడ్డి వెంకటేశ్వరరావు(43) గురువారం రాత్రి మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు... జీవీఎంసీ 89వ వార్డు ఖార్వేల్‌నగర్‌లో నివాసముంటున్న వెంకటేశ్వరరావు పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, కొడుకు ఉన్నారు. అయితే వెంకటేశ్వరరావు మద్యానికి బానిస కావడంతో భార్య విడిచి పెట్టి రెండేళ్లుగా పుట్టింట్లో ఉంటోంది. కాగా గురువారం మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి ఇంట్లో నిద్రపోయాడు. రాత్రయినా బయటకు రాకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి కిటికిలో నుంచి చూశారు. గదిలో పడి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపు తెరిచి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతికి గల కారణాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపట్నం సీఐ జి. అప్పారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు



మల్కాపురంలో వినియోగంలో లేని మరుగుదొడ్లు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ పక్కన గల గెడ్డకు ఆనుకుని హెచ్‌పీసీఎల్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. మొబైల్ కంటైనర్‌లో ఏర్పాటు చేసిన ఈ పబ్లిక్ టాయిలెట్లకు నీటి సదుపాయం లేకపోవడంతో కొంత కాలం నుంచి వినియోగించడం లేదు. ఇది ఇనుప కంటైనర్ కావడంతో తుప్పు పట్టింది. సంబంధిత అధికారులు స్పందించి ప్రజా మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని, లేకుంటే వాటిని ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

భద్రతపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

బీచ్‌రోడ్డు: 54వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ(ఎన్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో భద్రతపై క్విజ్, వ్యాసరచన, ప్రసంగ, క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కోసం బైక్ ర్యాలీ, ఉచిత కంటి వైద్య శిబిరంతోపాటు ఊహించని అగ్నిప్రమాదాలకు ఎలా స్పందించాలని ఫైర్ ఫైటింగ్ ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ కుసుమ కుమారి, జనరల్ మేనేజర్ ప్రాజెక్ట్స్ జి.పి.ఆర్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ

మల్కాపురం: ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యాధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో ములగాడ మండల పరిధి హెల్త్ సూపర్‌వైజర్ నారాయణరావు, స్థానిక సచివాలయం మెడికల్ విభాగ అధికారి కనక మహాలక్ష్మి, ములగాడ మండల పరిధి బీజేపీ అధ్యక్షుడు లక్కరాజు రామకృష్ణ తదితరులు పాల్గొని స్థానికులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలుగా దగ్గు తగ్గకున్న, జ్వరం వంటి సమస్య పీడిస్తున్నా వెంటనే స్థానిక వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీకి సంబంధించి ఉచితంగా మందులిస్తున్నట్లు చెప్పారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

నీటి దొంగలపై పోలీసులకు ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ గ్రీన్‌బెల్ట్‌లో జీవీఎంసీ వాటర్ ఫిల్లింగ్ పాయింట్ నుంచి నీటిని తరలిస్తున్న వారిపై చర్యలకు ఎట్టకేలకు అధికారులు సిద్ధమయ్యారు. జోన్–5లో నీటి దొంగలు అన్న శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జోన్–5 అధికారులు స్పందించారు. నీటిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఉద్యానవన విభాగం ఏఈ పల్లవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రీన్‌బెల్ట్ పార్కులో రైతు బజార్‌కు సమీపంలోని జీవీఎంసీ వాటర్ ఫిల్లింగ్ పాయింట్ నుంచి ఏపీ 31 టీపీ 6111 అనే నంబర్ గల వాహనంలో ప్రతీ రోజూ నీటిని తీసుకుపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తగిన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా గ్రీన్ బెల్ట్ వాటర్ ఫిల్లింగ్ పాయింట్ నుంచి శృతి హోటల్స్ యజమాని నగరంలోని ఉన్న తమ వ్యాపార సముదాయాలకు ట్యాంకర్ల ద్వారా ఇక్కడ నుంచే నీటిని సరఫరా చేస్తున్నారని కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు వెళ్లాయి.

ప్రాణం తీసిన అతివేగం

- బైక్‌తో చెట్టును ఢీకొని యువకుడి మృతి

మల్కాపురం: అతివేగం.. ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. ఈ దుర్ఘటన మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలివి.. బీహార్‌కు చెందిన ఆర్యన్ కుమార్(25) తన తల్లిదండ్రులు, అన్నయ్యతో కలిసి మల్కాపురం, ప్రకాష్ నగర్‌లో ఎనిమిదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. ఆర్యన్ హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీలో జరుగుతున్న విస్తరణ పనుల్లో ఎల్ అండ్ టీ హైడ్రోకార్బన్ ఇంజినీరింగ్ లిమిటెడ్(ఆఫ్) సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన ఆర్యన్.. కొంతసేపటి తర్వాత తన ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పని మీద నగరానికి బయలుదేరాడు. ములగాడ సేవా మార్గం నుంచి మారుతి సర్కిల్ మీదుగా వెళ్తుండగా.. హెచ్‌పీ పెట్రోల్ టెర్మినల్ ప్లాంట్ సమీపంలోని జాతీయ సేవా మార్గం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో ఆర్యన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రమాదం జరగడానికి గంట ముందు ఆర్యన్ తన సోదరుడికి ఫోన్ చేసి ఇంటికి ఆలస్యంగా వస్తానని చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంతలోనే ఈ ఘటన జరగడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్యన్‌కుమార్ మృతదేహం

మహిళలకు అధిక ప్రాధాన్యమివ్వాలి



మహిళలతో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఇతర అధికారులు

మహారాణిపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ లింగ సమానత్వం, మహిళా సాధికారత ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందన్నారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు, సృజనాత్మకత, ప్రజా సంక్షేమం పట్ల చూపిస్తున్న మహిళా ఉద్యోగుల అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, ఆనందపురం ఎంపీడీవో జానకీ, పరిపాలనాధికారి ఎ.మంజువాణి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ వద్దు..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్యలో సెల్‌టవర్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని స్థానికులు ఆందోళన చేపట్టారు. కాలనీలో ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ వల్ల రేడియేషన్ కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, పిల్లలు, వృద్ధులు తిరిగే ప్రదేశాల్లో ఇలాంటి టవర్లు ఏర్పాటు చేయడం సమంజసం కాదని నినదించారు. అధికారులు స్పందించి వెంటనే సెల్‌టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత సంఘ సేవకులు పెద్దిరెడ్ల నానాజీ, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆ షోకాజ్ నోటీసు వెనక్కి తీసుకోవాలి

సింధియా: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు, సీఐటీయూ యూనియన్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్‌కు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసును తక్షణమే ఉపసంహరించుకోవాలని హిందుస్తాన్ షిప్‌యార్డ్ సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎన్ రాజు, ఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. షిప్‌యార్డ్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిశ్రమల్లో పనిచేస్తున్న అధికారులను ఉపయోగించుకుని సీఐటీయూ నాయకుల మీద దాడి చేయిస్తుందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారనే నెపంతో అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చి ఉద్యమాన్ని ఆపలేరన్నారు. నోటీసును వెనక్కి తీసుకునే వరకు స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి అండగా ఉంటామన్నారు.



మాట్లాడుతున్న షిప్‌యార్డ్ సీఐటీయూ నాయకులు

సంతాన సాఫల్య శిబిరం రేపు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురంలోని వైజాగ్ ఐవీఎఫ్ సంతాన సాఫల్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహించనున్నారు. సంతానం లేని దంపతులకు ఉచితంగా కన్సల్టేషన్, స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


ఇది మా అడ్డా! — ఫోకస్



వాహనాలు నడవాల్సిన సర్వీసు రోడ్డులో పశువులు సంచరిస్తున్నాయి. ఆ సమయంలో వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రధాన సేవా మార్గం, ఐవోసీ చింతామణి దుర్గా గణపతి ఆలయానికి వెళ్లే మార్గంలో ఈ సమస్య రోజూ కనిపిస్తోంది. సమయపాలన లేకుండ పశువులను ఇష్టానుసారంగా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్యపై అధికారులు స్పందించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

- మల్కాపురం

ఘనంగా పైడిమాంబ అంబలం పూజ



అంబలం పూజలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెంలో పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం వెలంవీధి ప్రాంగణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. 108 కలశాలతో ఊరేగించి అమ్మవారికి అభిషేకం చేశారు. అర్చకులు వేమకోటి ఆంజనేయ శర్మ కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. పోతురాజుకు ప్రత్యేక పూజ అనంతరం పడి వెలిగించారు. అమ్మవారి భక్తిగీతాల ఆలాపనతో ప్రాంగణం మార్మోగింది. భవాని మాలధారులు, స్థానికులకు అంబలం పూజలో తీర్థప్రసాదాలతోపాటు అల్పాహారం అందించారు. గ్రామ కమిటీ సభ్యులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

బాలికలను రక్షించండి.. చదివించండి

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఆ శాఖ పీడీ జయదేవి ముఖ్య అతిథిగా పాల్గొని ఎంవీపీకాలనీలోని సంక్షేమ భవన్ ఎదుట ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైన విజ్ఞానాన్ని, మానసిక స్థైర్యాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు నిర్మూలించాలి, ఆడపిల్లలను రక్షించండి–చదివించండి అనే నినాదంతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఎంవీపీకాలనీలోని సెక్టార్–9 సంక్షేమ భవన్ నుంచి సమత కళాశాల కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖతో పాటు ఇతర శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభిస్తున్న పీడీ జయదేవి తదితరులు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఎంవీపీకాలనీ: బీసీ, ఈడబ్ల్యూసీ వర్గాలకు చెందిన డీఎస్సీ(ఎస్‌జీటీ) అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంవీపీ కాలనీలోని స్టడీ సర్కిల్‌లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల సర్టిఫికెట్లతోపాటు టెట్ మార్కుల లిస్ట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలను ఎంవీపీ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలని చెప్పారు. వివరాలకు 94925 69177 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ కోరారు.

నైపుణ్యాల సాధనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ రంగాల్లో పురోభివృద్ధి దిశగా సాగుతున్న మహిళలను దీనిలో భాగస్వామ్యులను చేసి, వారి సలహాలు, సూచనలు విద్యార్థినులతో చర్చించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ మాట్లాడుతూ నేటి రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా నైపుణ్యత సాధించాలని సూచించారు.